క్లుప్తంగా

వేములదీవి వెంకన్నకు పూజలు



ప్రతేకంగా అలంకరించిన వెంకటేశ్వరస్వామి

నరసాపురం రూరల్: వేములదీవిలోని కాపుల కొడవ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పూలతో అలంకరించారు. శనివారం వెంకటేశ్వరునికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అర్చకుడు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల ఆర్థిక సాయంతో సహకారంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

చిరు వ్యాపారానికి ఆర్థిక సాయం



పాలకొల్లులో టీ కొట్టు వ్యాపారులకు సాయం అందిస్తున్న జయసరిత

యలమంచిలి: పాలకొల్లు పట్టణంలోని కోర్టు పక్కన టీ కొట్టు పెట్టుకుని పాలకొల్లుకు చెందిన తల్లి కూతుర్లు ఈశ్వరమ్మ, రమణమ్మలు జీవనోపాధి పొందుతున్నారు. వ్యాపారం లేక నష్టం వచ్చి వ్యాపారం నిలిపి వేశారు. టీ వ్యాపారం మళ్లీ చేసుకోవడానికి పెట్టుబడి నిమిత్తం శనివారం తల్లీ కూతుర్లకు స్థానిక న్యాయవాది గంధం సుబ్బారావు ద్వారా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత రూ.5000 సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ మున్సిపల్ విభాగం అధ్యక్షులు జోగి వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, దేవ రాజేష్, వీరా మల్లికార్జునుడు, గుమ్మాపు సూర్య వరప్రసాద్, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం

భీమవరం: నిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతో మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని పలువురు వక్తలు తెలిపారు. భీమవరం మానవత సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు శనివారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజులు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం అందజేసే మందులతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా రెండవ శనివారం సంస్థ సభ్యుల సహకారంతో పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సంస్థ కో- చైర్మన్ కారుమూరి నర్సింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ దినేష్ కుమార్ జైన్, పళ్ల శేషలీల ఆర్థిక సహకారంతో భోజనం ప్యాకెట్లు, ఎనిమిది రకాల పప్పు దినుసులు, డ్రై ఫ్రూట్స్, వాటర్ ఫ్లాస్కులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం గోవిందబాబు,డాక్టర్ వేములరాంబాబు, సంస్థ కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, చేకూరి ఝాన్సీలక్ష్మి, సిహెచ్ రామకృష్ణంరాజు, వడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లుల ఆశీర్వచనం

పాలకోడేరు: చిన్న వయస్సు నుంచే పిల్లలు తల్లిదండ్రులను ఏవిధంగా గౌరవించాలి అనేది తల్లికి వందనం కార్యక్రమం తెలియజేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి తెలిపారు. శనివారం పాలకోడేరు మండలం మోగల్లులో అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలతో తల్లులకు పాదాభివందనం చేయించి, వారికి తల్లులతో ఆశీర్వచనం ఇప్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన జిల్లా కోఆర్డినేటర్ రమణకుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు మంచి అలవాట్లు అలవరచుకోవడంతో పాటు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలనేది నేర్చుకుంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు తల్లులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు విమల, చంద్ర కుమారి, శ్రీదేవి, రాధ, నాగలక్ష్మి, మంగ తాయారు, జోత్స్న సుబ్బలక్ష్మి చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

98 మందికి ఉద్యోగాలు

ఆకివీడు: స్థానిక విద్యా వికాస్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 98 మందికి ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకురాలు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి శనివారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఇంటర్వ్యూలకు 120 మంది నల్గొండ నుంచి హాజరయ్యారని ఆమె చెప్పారు. ఫ్లిప్ కార్ట్, యాక్సిస్ బ్యాంక్, రేమండ్ ,మహీంద్ర, వాల్ మార్ట్, కొటక్ టాటా మ్యూచువల్, బీహెచ్ఈఎల్ తదితర 12 సంస్థల నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సాహంగా పాల్గొన్న యువతీ యువకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో కూల్‌కూల్

ఈతతో ఉపశమనం పొందుతున్న చిన్నారులు



స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు, యువత

నరసాపురం రూరల్: వేసవి ఎండలు మండిపోతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చిన్నారులు కొందరు కొలనుల్లో ఈత కొడుతూ భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందుతున్నారు. దేహదారుఢ్యంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి ఈతతో మేలు చేకూరుస్తుందని వైద్యులు, వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. నరసాపురంలో దాదాపు దశాబ్దకాలం క్రితం ఈత కొలనును ఏర్పాటు చేసి దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. పిల్లలందరికీ ఈత నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటుంది. చిన్నారుల తప్పనిసరిగా హెయిర్‌క్యాప్, స్విమ్మింగ్ సూట్, గుగూల్స్‌వంటి వాటిని కచ్చితంగా వినియోగించాలి. దీంతో ఈత కొలనులో ఎక్కువ సేపు జలకాలాడినప్పటికీ తల, కళ్లు, చెవులకు సంబంధించి ఇన్‌ఫెక్షన్లు రావు. స్విమ్ సూట్ ధరించడం వల్ల ఈత కొట్టేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఈత కొలనులో ప్రతిరోజూ ఫిల్టర్స్ సహాయంతో శుభ్ర పరచడం, నీరు స్వచ్ఛతగా ఉండేందుకు అవసరమైన కెమికల్స్ కలపడం, వాటర్ లెవెల్ సరిపడే విధంగా నిర్వహణ చేస్తూ నీటితో నింపుతున్నట్లు నిర్వాహకుడు సుంకర రమేష్ చెబుతున్నారు. తొలుత తక్కువ లోతులో శిక్షకుని పర్యవేక్షణలో ఈత కొలనులో దిగడం ప్రాథమిక జాగ్రత్తగా తెలిపారు. ఈత నేర్చుకోవడం వేసవి నుంచి ఉపసమనం కోసమే కాకుండా నిత్యం ఓ అలవాటుగా మలుచుకుంటే ఆరోగ్యకరంగా ఉండవచ్చునని పేర్కొన్నారు.

స్విమ్మింగ్ అంటే ఇష్టం



నాకు ఈత అంటే ఆసక్తి ఉండేది. నా ఆసక్తిని గమనించి మా నాన్న ఇక్కడ జాయిన్ చేశారు. కోచ్ పర్యవేక్షణలో ఈత నేర్చుకోవడం వల్ల నాకు ధైర్యం వచ్చింది. ఇక్కడి సౌకర్యాలు బాగున్నాయి. 10 రోజులుగా ప్రతి రోజూ ఈత నేర్చుకునేందుకు వస్తున్నాను. ఇప్పుడు ఎవరి సాయం లేకుండా నేను ఒక్కదాన్నే ఈత కొట్టగలను.

– ఎస్‌హెచ్ చందన, నరసాపురం

కొద్దిరోజుల్లోనే ఈత కొడుతున్నా



నేను 6వ తరగతి చదువుతున్నాను. ఎప్పుడైనా అమ్మానాన్నలతో గోదావరి, సముద్రం స్నానాలకు వెళ్లినప్పుడు ఈత కొట్టాలని ఉన్నా వాళ్లు అడ్డుచెప్పేవారు. వారంరోజుల నుంచి ప్రతి రోజూ ఇక్కడకు వచ్చి ఈత కొడుతున్నాను. వారం రోజుల్లోనే పూర్తిస్థాయిలో ఈత కొట్టగలుగుతున్నాను.

– పి.గ్రేష్మశ్రీ, నరసాపురం

స్విమ్మర్ కావాలని ఉంది



గత రెండేళ్లుగా ఇక్కడ స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాను. చిన్నపిల్లలకే కాకుండా పెద్దవారికి కూడా ఉపయోగపడేలా ఇక్కడ పెద్ద స్విమ్మింగ్ పూల్ ఉంది. సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్న నేను ఇక్కడ దేహదారుఢ్యంతో పాటు మంచి రిలాక్సేషన్ పొందుతున్నారు. నాకు చిన్నతనం నుండీ ఈత అంటే ఇష్టం. ఇక్కడికి వచ్చాకా పూర్తి స్థాయిలో ఈత నేర్చుకున్నాను. స్విమ్మింగ్‌లో కాంపిటీషన్లకు వెళ్లాలని ఉంది.

– ఎల్ నరసింహస్వామి, నరసాపురం

శని త్రయోదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరుడు

పెనుగొండ: శని త్రయోదశి సందర్భంగా పెనుగొండలో శనీశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి శ్రీనగరేశ్వర మహిషాసుర మర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోని నవగ్రహ ఉపాలయంలో అర్చకుడు కేవీ సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శనీశ్వరుడుకి క్షీరాభిషేకం, తైలాభిషేకం, పలరస అభిషేకం చేశారు. అనంతరం నవగ్రహాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు దర్శనం చేసుకొన్నారు.

మావుళ్లమ్మ సేవలో పాకా

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని ఎంపీ అభ్యర్థి పాకా వెంకట సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధైర్యంగా పోరాడుతున్న మన సైనికులకు, భారత ప్రధాని మంత్రి నరేంద్ర మోదీకి శ్రేయస్సు చేకూరాలని, మన త్రివిధ దళాలకు యోగక్షేమాలు ప్రసాదించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేసి, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మీ నగేష్ శేషవస్త్రం ప్రసాదాలను అందజేశారు.

రేషన్‌లో కందిపప్పు లేనట్టే!

- ప్రభుత్వం ఇచ్చే కిలో కూడా నిలుపుదల
- బయట మార్కెట్లో కిలో రూ.150
- యలమంచిలి మండలంలో 23,060 రేషన్ కార్డులు



మేడపాడులో రేషన్ సరుకులు ఇస్తున్న ఎండీయూ వాహనం

యలమంచిలి: ప్రజా పంపిణీ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా ఇచ్చే కందిపప్పును ఐదు నెలలుగా పంపిణీ చేయడం లేదు. ఒకవైపు బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేదలకు కనీసం పప్పు కూడు కూడా దొరకని పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రభుత్వ పాలకులు పేదల జీవన ప్రమాణాలు పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కేవలం కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం, పంచదార పరిమితం చేస్తూ మిగతా నిత్యావసర సరుకులు పంపిణీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం సమంజసం కాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యలమంచిలి మండలంలో మొత్తం 53 రేషన్ షాపులు ఉండగా 23,060 తెల్ల రేషన్ కార్డులున్నాయి. వీటి ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా కిలో కందిపప్పు రూ.67కు సరఫరా చేసేవారు. ఐదు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయకపోవటంతో పేదలు బయట మార్కెట్లో కందిపప్పు కిలో రకాన్ని బట్టి రూ.110 నుంచి రూ.150కు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేయటం లేదని సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. రోజు కూలీ చేసుకునే పేదలు, కొద్దిపాటి వేతనాలతో పనిచేసే చిరుద్యోగులు కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కొనలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పేదల గురించి ఆలోచించి నిత్యావసర సరుకులు ప్రతి నెలా క్రమం తప్పకుండా అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకలి తీర్చలేని ప్రభుత్వమిది



పేదవాడి ఆకలి తీర్చలేని ప్రభుత్వమిది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌లో సగం కూడా అమలు చేయలేదు. బయట మార్కెట్‌లో నిత్యావసర సరుకులు మండిపోతున్నా అరికట్టడం లేదు. ఈ నేపథ్యంలో రేషన్ సరుకుల్లో కూడా కోత పెట్టడం సమంజసం కాదు.

– కంబాల సత్యశ్రీ, గుంపర్రు

పేదలపై కనికరం లేదు



రాష్ట్ర ప్రభుత్వానికి పేదలపైనా కనికరం లేదనిపిస్తుంది. ఒకవైపు గ్యాస్ సిలెండర్ ధర పెంచారు. విద్యుత్ చార్జీలు పెంచారు. మరోవైపు రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులు తగ్గించారు. అసలు రాష్ట్రంలో పేదవాడు ఎలా బతకాలో అర్థం కాకుండా ప్రభుత్వ పాలన ఉంది.

– విప్పర్తి ప్రశాంతి, చించినాడ

సైనికుల వీరోచిత పోరాటం



వైట్ల కిషోర్

పెనుగొండ: ఉగ్రవాద ముష్కర మూకలపై భారత సైనికులు వీరోచిత పోరాటం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సరిహద్దుల్లో భారత సైన్యం ప్రాణాలొడ్డి పోరాడిందన్నారు. వీర జవానులు వీరమరణాలకు ప్రతి ఒక్కరూ సంతాపం వ్యక్తం చేయాలన్నారు.

సైనికులకు మద్దతుగా పూజలు



కొఠాలపర్రులో జవాన్లకు మద్దతుగా పూజలు చేస్తున్న దృశ్యం

పెనుగొండ: భారత సైనికులకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కొఠాలపర్రులోని స్వయంభు కేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూరు ఆధ్వర్యంలో పహల్గాం మృతుల ఆత్మలకు శాంతి కలుగాలని ప్రార్థించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయి విజయవంతం కావాలని, సైనికులకు మరింత మనో బలం చేకూరాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గున్నేపల్లి పుల్లాజీ, పాదల సుమన్, బొబ్బిలి సత్యనారాయణ, ఇరగవరపు రాధాకృష్ణ, దంపనబోయిన మోహన కృష్ణ, పడాల విష్ణులు పాల్గొన్నారు.

మురళీ నాయక్‌కు నివాళి



మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పెనుగొండ: సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన యుద్ధం అమరవీరుడు మురళీ నాయక్‌కు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల వాకర్స్ క్లబ్ ఘనంగా నివాళులర్పించింది. శనివారం ఉదయం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వందేమాతరం నినాదాలతో హోరెత్తించారు. వాకర్స్ క్లబ్ సభ్యుడు కళాశాల ఆంగ్ల విభాగ హెడ్ శశికుమార్ మాట్లాడుతూ దేశం కోసం అమరుడైన మురళీ నాయక్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాడని అన్నారు. కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, నూకల రాంబాబు, నూలి సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, చంటి, గాజుల శ్రీనివాస్, బళ్ల రాంబాబు, చలుమూరి శేఖర్, జుత్తిగ కృష్ణ, బాబ్జీ, సురేష్, మహేష్, రామకృష్ణ, మండ ప్రసాద్‌లు పాల్గొన్నారు.


ప్రజల పక్షాన పోరాడుదాం



వైఎస్సార్ సీపీ కొంతేరు కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు కష్టాలు కొత్త కాదనీ.. నాలుగేళ్లు ఓర్చుకుంటే మళ్లీ విజయం మనదేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు చెప్పారు. యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న 2.0 పాలనలో కార్యకర్తలకు న్యాయం చేకూరుతుందని చెప్పారు. కూటమి నాయకులు ఎన్ని కష్టాలకు గురిచేసినా ఓరిమితో ప్రజల పక్షాన పోరాటం చేద్దామని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం వేయడం సరికాదన్నారు. అనంతరం పార్టీ నూతన గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు జాబితాను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కార్యాలయానికి పంపారు. తొలుత యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వినుకొండ రవి, నిమ్మకాయల రామకృష్ణ, కుక్కల రామకృష్ణ, కానుకొలను చిట్టిబాబు, జల్లి శాంతరావు, కొయ్యే నాగేశ్వరావు, జోగి రాజేష్, తేన్నేటి అలెగ్జాండర్, బందెల జార్జి, గొట్టుముక్కల జగజీవన్‌రావు, పత్తికాయల దుర్గాప్రసాద్, ఏనుగుపల్లి చల్లారావు, సిల్లే రాజు, జక్కంశెట్టి శ్రీనివాస్, పోలుకొండ ఏలియా భక్తసింగ్, నిమ్మకాయల వెంకట్, సదమల్ల బాలరాజు, తెన్నేటి శ్రీనివాస్, లంక చిరంజీవి, ఉన్నమట్ల రాజమోహన్, కనపాల మోహనరావు, సిర్రా నాగరాజు, పాలపర్తి సందీప్ సోషల్ మీడియా అధ్యక్షుడు కుక్కల బాలచంద్రన్, ఐటీ వింగ్ అధ్యక్షుడు పోలుకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కనకదుర్గమ్మ జాతర మహోత్సవాలు



ఇత్తడి కవచంతో కనకదుర్గమ్మ



పూరి గుడిలో పూజలందుకుంటున్న అమ్మవారి గరగలు

పెనుమంట్ర: మండలంలోని వెలగలవారిపాలెం గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 11వ తేదీన ప్రారంభమై 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఐదేళ్లకు ఒకసారి గ్రామ రెడ్డి యూత్, కొత్తూరు యూత్ సంయుక్తంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 11న ఆసాదుల గరగ నృత్య ప్రదర్శనలు, బోనాల ఊరేగింపు, కళాబృందాల డప్పు వాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచ కాల్పులతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 12వ తేదీ రాత్రి పూరి గుడి వద్ద ఆసాదుల ఆగం ప్రదర్శించన అనంతరం పంబ సేటాను గ్రామ పొలిమేర్లలో ఊరేగిస్తారని చెప్పారు. 13వ తేదీ ఉదయం అమ్మవారికి నైవేద్యాలు చెల్లించి పూరి గుడి వద్ద మక్కులు చెల్లిస్తారు. 14వ తేదీ తెల్లవారుమజామున అమ్మవారిని పూరి గుడి నుంచి ప్రధాన ఆలయానికి తీసుకువెళ్లి మొక్కులు చెల్లించిన అనంతరం అమ్మవారిని దర్శించుకుంటారు. ఊరంతా విద్యుత్ దీపాలంకరణ, ప్రవాస భారతీయులు, ఇతర రాష్ట్రాల ఉండే బంధుమిత్రులు రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

తణుకు అర్బన్: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కలింగ లక్ష్మణరావు కోరారు. శనివారం తణుకు మండలం దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో పని ప్రదేశాల్లో ఉన్న ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. శ్రామికుల ఆర్తనాధాలతో, పోరాటాలతో,ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఈ చట్టం ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు ఈ చట్టం పని దినాలు, కూలీల వేతనాలు కేటాయింపు, పనిముట్లు తగిన స్థాయిలో శ్రామికులకు కేటాయింపులు చేయడం లేదని విమర్శించారు. కార్మిక నాయకులు ఎంతమంది త్యాగజనుల పోరాటాల ద్వారా సాధించుకున్న ఈ చట్టం భవిష్యత్తులో రద్దు చేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని అందులో భాగంగానే పని దినాలు, పనిముట్లు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు దిద్దే నాగేశ్వరావు, శ్రామికులు పాల్గొన్నారు.

ఉచిత వెబ్ డెవలప్‌మెంట్ కోర్సు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వెబ్ డెవలప్‌మెంట్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. గ్రాఫిక్ డిజైన్ అసోసియేట్ కోర్సులో రెండు నెలలు ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థిని విద్యార్థులు అర్హులని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 83092 08484లో సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన బైబిల్ తరగతులు

ఉండి: చెరుకువాడ చినపేటలో చిన్నారులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన వేసవి కాల బైబిల్ తరగతులు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన చెరుకువాడ సీబీసీఎన్‌సీ చర్చ్ పేరిష్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎస్ జార్జ్‌ముల్లర్ మాట్లాడుతూ బాల్యానికి సరైన దారి చూపిస్తే భవిష్యత్ జీవితంలో విజయం తథ్యమవుతుందన్నారు. బైబిల్ తరగతులు నిర్వహించడం ద్వారా చిన్నారులను ఆధ్యాత్మికత వైపు నడిపించవచ్చునని తెలిపారు. కథలు చెప్పడం, స్పీచ్ ఇవ్వడం వంటివి కూడా చిన్నారులను నాయకులుగా నిలుపుతాయన్నారు. దీనిద్వారా భవిష్యత్‌లో వారంతా ఉన్నతమైన ఆలోచనలు కలిగి మంచి భవిష్యత్‌ను సాధిస్తారని అన్నారు. సమాజానికి ఉపకారులుగా వారిని తీర్చిదిద్దేందుకు బైబిల్ తరగతులు ఎంతో సహకరిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సంఘ సీఆర్ ఎం శామ్యూల్, సంఘ పెద్దలు కడలి యేసు, మద్యా సుబ్బారావు, బొబ్బనపల్లి జార్జ్, తాడి పవన్, పి.మార్కురాజు, బి.శ్రీకాంత్, సండెస్కూల్ టీచర్స్ ఎన్ దేవాప్రిస్కిల్లా, ఎం దీప్తి, కే మణిమేఘన, కే లికిత, పి.కుమారి, ఈ కొగ్గా పాల్గొన్నారు.